# నీతి కథలు

2

Akhlaqui Kahaniyan-1
(Telugu)

# నీతి కథలు

## (మొదటి భాగం)


మూలం

**మౌలానా అఫ్జల్ హుసైన్** M.A., Litt.

అనువాదం

**అబ్బాదుల్లా** B.A.

**ఎం.డి. ముజాహిద్**



HYDERABAD

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.

**Neethi Kathalu - 2nd Part**

**Akhlaqui Kahaniyan-II** (Telugu)

**T.I.P. Series No. 34**

| | | |
|---|---|---|
| Author | : | Maulana Afzal Hussain M.A., L.T. |
| Translated by | : | Abbadulla, Md.Mujahid |

All Rights Reserved with Publishers

| | | |
|---|---|---|
| 9th Edition | : | October 2016 |
| Copies | : | 2000 |
| Price | : | **Rs. 15** |
| ISBN | : | 81 - 86826 - 59 - 9 |

Published by **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Phones: 040-24564583, 24576237
e-mail: geeturaiweekly@gmail.com

| | | |
|---|---|---|
| Typeset by | : | Geeturai Graphics<br>Lakkadkot, Hyderabad - 2 |
| Printed at | : | Cosmic Printers<br>Lakkadkot, Hyderabad-2 |

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# 1. విద్యాభ్యాసం పట్ల ఆసక్తి

పూర్వం జరిగిన విషయం. అప్పటికే మహాప్రవక్త ముహమ్మద్ (స) కాలధర్మమొంది చాలా కాలం అయింది. ఆయన సహచరుల కాలం కూడ గడిచిపోయింది. మదీనా పట్టణం పేరు మీరు వినియే ఉంటారు. ప్రసిద్ధికెక్కిన పండితులొకరు ఆ పట్టణంలో ఉండేవారు. ఆయన పేరు ఇమామ్ మాలిక్ (రహ్మలై). దైవ గ్రంథమైన ఖుర్ఆన్ బోధించడంలో, మహాప్రవక్త (స) ప్రవచనాలను వివరించి చెప్పడంలో గొప్ప అనుభవంకల విద్వాంసుడాయన. అందుకే దూర దూర దేశాల నుండి విద్యార్థులు మదీనా చేరుకునేవారు, ఆయన వద్ద విద్య నభ్యసించేవారు.

విదేశాల నుండి వచ్చిన విద్యార్థులలో యహ్యా ఒకడు. ఇతడు స్పెయిన్ దేశానికి చెందిన విద్యార్థి. ఇస్లామీయ విద్య అంటే ఎంతో ఆసక్తిగలవాడు యహ్యా. అందుకే ఆప్తులను వదలి దూరదేశ ప్రయాణం సహించి మదీనా చేరాడు. ఇస్లామ్ చూపే జీవిత విధానపు విద్యనభ్యసిస్తున్నాడు.

ఒకనాటి విషయం. గురువుగారు పాఠం చెబుతున్నారు. విద్యార్థులందరు వింటున్నారు. ప్రక్క వీధిలో ఏదో వచ్చింది. విద్యార్థులందరు గందరగోళం చేయసాగారు. చివరకు "ఏనుగండి, ఏనుగు" అని కేకలు వేశారు. అరబ్బు దేశాలలో ఏనుగులుండవు కదా! క్రొత్త ఒక వింత అన్నట్టు ఎప్పుడూ ఏనుగును చూడని వారు ఏనుగును చూశారు. ఆశ్చర్యం కలిగింది. వెంటనే తమ తమ స్థానాల నుండి లేచారు. ఏనుగును చూద్దామని పరుగెత్తారు. బయటికి వచ్చి గజరాజును చూడసాగారు. కాని యహ్యా మాత్రం కూర్చున్న చోటు నుండి కదలలేదు. అటు ఇటు చూడక తనేమో తన పనేమో అన్నట్టు నిమగ్నుడయి ఉన్నాడు.

ఏకాకియై కూర్చున్న బాలుని చూశారు గురువుగారు. "నాయనా! స్పెయిన్

దేశంలో కూడా ఏనుగులుండవు కదా? నీవెందుకు వెళ్ళకుండ ఉన్నావు. పో, పోయి ఏనుగును చూచిరా" అని అన్నారు గురువుగారు. యహ్యా లక్ష్య సాధకుడు. ప్రతివేళ తాను వచ్చిన పనిని దృష్టిలో ఉంచుకుని నడచుకునేవాడు. సగౌరవంగా అతడిలా అన్నాడు, "గురువర్యా! మన్నించండి. స్వదేశాన్ని వదిలి మీ వద్దకు వచ్చాను. విద్యనభ్యసించాలని వచ్చాను. మీ సాన్నిధ్యంలో ఉండి ఉత్తమ విద్య నేర్వదలచాను. మంచి మంచి మాటలతో నా మనసులోని దప్పిక తీర్చుకోదలిచాను. అంత దూరం నుండి ఏనుగును చూడ రాలేదు కదండి" అని అన్నాడు యహ్యా.

వివేకవంతుడైన విద్యార్థి ఇచ్చిన జవాబు విన్నాడు గురువు. ఎంతో ఆనందం కలిగింది. మనస్ఫూర్తిగా యహ్యా పురోభివృద్ధికై ప్రార్థించాడు గురువు. "వివేకవంతుడవై వర్ధిల్లు నాయనా!" అని ఆశీర్వదించాడు గురువు.

ప్రేమానురాగాలతో మనసారా పలికిన గురువుగారి ఆశీర్వచనాలను అల్లాహ్ స్వీకరించాడు. యహ్యా స్పెయిన్ దేశంలోని పేరుప్రతిష్టలు పొందిన పండితుడయ్యాడు.

# 2. ఖుర్ఆన్ పట్ల గౌరవం

మహ్మూద్ గజనవీ పేరు మీరు వినే ఉంటారు. ఇతడు గజనీ దేశస్థుడు. ఎన్నో కారణాల వల్ల ఇతడు హిందూ దేశంపై పదిహేడుసార్లు దండెత్తాడు. ఇతని జీవితంలో ఒక ముఖ్య సంఘటన జరిగింది. అదేమిటో వినండి.

ఒక రోజున రాత్రి చాలా గడిచిన తరువాత దినమంతా కార్యనిమగ్నుడై గడిపిన ఆ రాజు అలసిపోయాడు. నిద్రపోదామని పడక గది చేరాడు. అనుకోకుండ అతని దృష్టి అక్కడున్న అటకపై పడింది. ఏం చూస్తున్నాడు? పవిత్ర గ్రంథమయిన ఖుర్ఆన్ అక్కడుంది. పడకకు కాళ్ళ వైపున ఉంది. "ఏం చేయాలి? అటు వైపు కాళ్ళుసాచి పడుకుంటే పవిత్ర గంథాన్ని అగౌరవపరచినట్లవుతుంది. ఉద్గ్రంథం

వైపు తలచేసి పడుకుంటే బాగుంటుంద"ని తలచాడు ఆ రాజు. వెంటనే ఉన్న స్థలం నుండి మంచాన్ని మార్చాడు. ఖుర్‌ఆన్ గ్రంథం ఉన్న దిక్కుకు మంచం తల భాగాన్ని చేశాడు. ఇక పడుకోబోతున్నాడు. తటాలున ఇంకొక భావం అతనికి తట్టింది. "దైవగ్రంథం అక్కడుంది. అల్లాహ్ ఇచ్చిన ఆజ్ఞలన్నీ అందులో ఉన్నాయి. వాటిని చదివి అర్థం చేసుకుని తదనుసారం ప్రవర్తించక హాయిగా నిద్రించడం భావ్యమా? కాదు, అది భావ్యం కాదు" అని తలపోశాడు మహ్మూద్ గజనవీ. కాస్త యోచించాడు, ఒక ఉపాయం తట్టింది. "ఉద్గ్రంథాన్ని అటకపై నుండి తీసి ఆవలి గదిలో పెట్టి పిమ్మట పడక గదిలో సుఖంగా నిద్రించవచ్చని అనుకున్నాడు. ఈ భావం కలగ్గానే మహ్మూద్‌కు దైవభీతి కలిగింది,కంపించిపోయాడు. "ఎంతటి అగౌరవ కృత్యం తలపెట్టాను. కేవలం నా సుఖం కోసం దైవోపదేశ గ్రంథమైన ఖుర్‌ఆన్‌ను గది నుండి వేరుచేయాలా? ఎంతటి దౌర్జన్యానికి ఒడిగట్టాను?" అని బాధపడ్డాడు మహ్మూద్ గజనవీ. ఇక అలాగే బాధపడుతూ పడక గదిలోనే కన్ను కూడా మూయకుండా రాత్రంతా గడిపాడు ఆ 'మహారాజు.'

# 3. "శ్రమ" పట్ల గౌరవం

ఎందరో ఖలీఫాలు (ప్రాతినిధ్య పాలకులు) ఇస్లామియ రాజ్య పరిపాలన చేశారు. అందులో ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ఒకరు. అరబ్బీ భాషలో ప్రాతినిధ్య పాలకుణ్ణి "ఖలీఫా" అంటారు. ఉమర్ సద్గుణ సంపన్నుడు. ఆడంబరంలేని జీవితం గడిపేవాడు.

ఖలీఫా ఇంటికి అనేక మంది అతిథులు వచ్చేవారు. ఒకనాడు ఖలీఫా ఇంటికి ఒక వ్యక్తి వచ్చాడు. ఆనాటి రాత్రి ఖలీఫా దీపం దగ్గర వెలుగులో కూర్చుని ఏదో వ్రాసుకుంటున్నాడు. ఇంతలో దీపంలోని నూనె అయిపోయింది. వత్తి ఆరిపోయింది. ఇంటికి వచ్చిన వ్యక్తి ముందుకు వచ్చాడు, "విచారించకండి! నేనిప్పుడే అందులో నూనె వేసి దీపం వెలిగిస్తాను" అని అతడు అన్నాడు.

"అతిథులచే పని చేయించుకోవడం సమంజసంకాదని" అన్నాడు ఖలీఫా.

"ఉండండి, కనీసం నౌకరునయినా మేల్కొలుపుతాను. అతడు దానిని క్షణాల్లో వెలిగించగలడు" అని అన్నాడా అతిథి.

"అక్కరలేదండి. అతడిప్పుడే నిద్రపోయాడు. ఈ స్వల్ప విషయానికై నౌకరుకు నిద్రాభంగం కలిగించడం భావ్యం కాదు" అని అన్నాడా దయార్ద్ర హృదయుడు.

ఆయనే స్వయంగా లేచాడు, దీపం బుడ్డిలో నూనె పోసుకుని వచ్చాడు. దీపాన్ని వెలిగించాడు.

"అయ్యో, చివరకు మీరే శ్రమపడవలసి వచ్చిందే" అన్నాడు వచ్చిన వ్యక్తి.

"ఇందులో శ్రమ ఏముందని? నూనె కోసం వెళ్ళినపుడు నేను ఉమర్‌గానే ఉన్నాను. దీపంలో నూనె వేసి వెలిగించినప్పుడు కూడా నేను ఉమర్‌గానే ఉన్నాను. పనిచేసినంత మాత్రాన నాలో కలిగిన మార్పేమీ లేదే? చేతులతో స్వయంగా పనిచేసుకోవడంలో తప్పేమీ లేదండి" అన్నాడు ఇస్లామీయ ఖలీఫా.

# 4. సాహసం

మహాప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో జరిగిన సంఘటన. అప్పటికే మహాప్రవక్త (స) దైవధర్మ సంస్థాపనార్థం మదీనా పట్టణానికి వలసపోయారు. కాని శత్రువులు అచ్చట కూడ ఆయన్ని వెంబడించసాగారు. సైన్యాన్ని సమీకరించి ముస్లిములపై దండెత్తి రాసాగారు. అటు ముస్లిమ్‌లు కూడ శత్రువులను తుదముట్టించేందుకు సమర సన్నాహాలు మొదలుపెట్టారు. దైవ మార్గంలో ధర్మ యుద్ధం చేసేవారి త్యాగం సామాన్యమా? పౌరుష వీరులు, యువకులు, తుదకు పసి పిల్లలు కూడా ప్రాణత్యాగానికి సంసిద్ధులై ముందుకు వచ్చారు. సైన్యంలో చేరే కుతూహలంతో నిలిచారు. వచ్చినవారినందరినీ మహాప్రవక్త (స) చూశారు.

పసిపిల్లల్ని చూచి, "మీరింకా ఈడే రాని బాలురు. పెరిగి పెద్దవారయ్యాక ధర్మ యుద్ధంలో పాల్గొందురుగాని, ప్రస్తుతం సైన్యంలో చేరనవసరంలేద"న్నారు. వచ్చిన బాలురలో 'రాఫె' ఒకడు. అతన్ని కూడ మహాప్రవక్త (స) చూశారు. "నీవింకను పొట్టిగా ఉన్నావు" అని చెప్పి వెనుకకు పంపారు మహాప్రవక్త (స). కాని రాఫేకు ధర్మ యుద్ధంలో పాల్గొనాలని ఎంతో ఉత్సాహం ఉంది. వయస్సులో రాఫె పిల్లవాడేకాని తెలివితేటల్లో పెద్దవాడే. వెంటనే అతనికి ఒక ఉపాయం కలిగింది. మహాప్రవక్త (స) ముందుకు వచ్చాడు, కాలి బొటన వ్రేళ్ళపై నిలబడ్డాడు, ఉన్న పొడుగుకంటే ఎత్తయినవానివలె అగుపించాడు. ఇంకా ఇలా అన్నాడు:

"ఓ దైవప్రవక్తా! నేను కూడా పెద్దవాడినే, ఖడ్గం చేబూని శత్రువులను హతమార్చగలన"న్నాడు రాఫె. పిల్లవాని అంతులేని ఉత్సాహం చూశారు. అతనిని సైన్యంలో చేర్చుకున్నారు మహాప్రవక్త (స).

ఇంతలో ఇంకొక బాలుడు వచ్చాడు. అతని పేరు సామ్రాహ్, ముందుకు వచ్చి, "ఓ ప్రవక్తా! యుద్ధంలో పోరాడాలని వచ్చాను. సైన్యంలో చేర్చుకోండి. యుద్ధంలో బలప్రయోగం అతి ముఖ్యం. ఇప్పుడిప్పుడే సైన్యంలో చేరిన రాఫే కంటే నేనధిక బలం కలవాడను. ఎత్తులో, పొడువు తక్కువ అయినంత మాత్రాన ఏమిటి? కావాలంటే రాఫేతో కుస్తీ పెట్టి పరీక్షించండి" అన్నాడు ఆ సాహసపరుడు.

సామ్రాహ్ పెట్టిన షరతు మహాప్రవక్త(స)కు నచ్చింది. సామ్రాహ్-రాఫేల మధ్య కుస్తీ జరిగింది. కుస్తీలో సామ్రాహ్ రాఫేను ఓడించాడు. ఇస్లామ్ సైన్యంలో చేరాడు.

సాహసవీరులిద్దరికీ దైవ ప్రీతి లభించుగాక!

# 5. ఉన్నమాట ఉన్నట్టు పలుకుట

తురుష్కులలో పేరు ప్రసిద్ధి చెందిన రాజులు ఉండేవారు. వారిలో సుల్తాన్ బా యజీద్ ఒకరు. అతడెంతటి పరాక్రమశాలియో అంతటి న్యాయవాది కూడ. విధిగావున్న ధర్మాలు నిర్వహించేవాడు. వేళకు నమాజు చేసేవాడు. విధిగా

వున్న దానం చేసేవాడు. కాని ఒక్క లోపం అతనిలో ఉండేది. అతడు సామూహిక నమాజులో పాల్గొనేవాడు కాడు. అతని కాలంలో జరిగిన విషయం వినండి.

ఒకనాడు న్యాయస్థానానికి ఒక వివాదం వచ్చింది. వాది ప్రతివాదులిద్దరూ న్యాయం కోరారు. విచారణలో సుల్తాన్ బా యజీద్ ఒక ముఖ్య సాక్షి. అప్పట్లో మౌలానా షంషుద్దీన్ న్యాయాధిపతిగా ఉండేవాడు. ఇతడు రోమన్ దేశస్థుడు. దైవ నియమిత ధర్మం ప్రకారం తీర్పు చేసే న్యాయమూర్తి. న్యాయస్థానంలో విచారణ మొదలయింది. సుల్తాన్ బా యజీద్ వివాదంలో సాక్ష్యమివ్వడానికి న్యాయస్థానం చేరాడు. కాని న్యాయమూర్తి రాజుగారి సాక్ష్యం తీసుకొనుటకు నిరాకరించాడు.

సుల్తాన్ కూడ ధర్మచట్టపు నియమాల నెరిగినవాడే. పైగా న్యాయం అభిలషించే ధర్మమూర్తి కూడ. సాక్ష్యం తీసుకొనుటకు తిరస్కరించినంత మాత్రాన తప్పుగా భావించక కారణం తెలుపమని న్యాయమూర్తిని కోరాడు సుల్తాన్ బా యజీద్. తక్షణమే న్యాయమూర్తి కారణం తెలిపాడు. "ఎవరయితే దైవధర్మానుసారం సామూహిక నమాజులలో పాల్గొనరో అట్టివారి సాక్ష్యం చెల్లదు. ఇక మీ సాక్ష్యం ఎందుకు తీసుకోబడలేదో మీరే గ్రహించండి" అని అన్నాడా న్యాయాధిపతి. ఆ మాటలు సూల్తాన్ మనస్సుకు గుచ్చుకున్నాయి. అప్పటి నుండి క్రమం తప్పకుండా సామూహిక నమాజు చేయడం మొదలుపెట్టాడు సుల్తాన్.

# 6. నిరాడంబర జీవితం

హిందూ దేశాన్ని పాలించిన ముస్లిమ్ రాజులలో సుల్తాన్ నాసరుద్దీన్ ఒకడు. ఇతడు సత్శీలుడు. ఆడంబరంలేని జీవితం గడిపేవాడు. అతని నివాస పరిసరాలను చూస్తే, అవి అతని పేరుకు, పదవికి భిన్నంగా ఉండేవి. రారాజుల వలె అంతులేని సుఖలాలస జీవితం గడపక చేతులారా కష్టపడి స్వయం సంపాదనచే జీవితం గడిపేవాడు సుల్తాన్ నాసరుద్దీన్. ప్రభుత్వపు ధనాగారం నుండి ఒక్క చిల్లిగవ్వ కూడ ముట్టక కష్టపడి విత్తమార్జించేవాడు. పవిత్ర గ్రంథ ప్రతులను వ్రాసేవాడు. అందమయిన దస్తూరితో ఆరు నెలలకొక ప్రతి వ్రాసేవాడు. సాలుకు రెండు ప్రతులు వ్రాసి వాటి నుండి వచ్చే ధనంతో కాలం గడిపేవాడు.

అప్పుడప్పుడు టోపీలు అల్లి కొంత ధనం చేకూర్చుకునేవాడు. అంతటి స్వల్ప ఆదాయంతో ఎంతటి సాధారణమయిన జీవితం గడిపేవాడో మీరే యోచించండి.

ఇక మహారాణి కూడ సకల సద్గుణ సంపన్నురాలు. నిరాడంబరపు జీవి. మహారాజు కష్టపడి ధనం సంపాదిస్తే రాణిగారు స్వయంగ వంట చేసి వడ్డించేవారు. భార్యాభర్తలిరువురూ ఎంతో పేదరికంతో కాలం గడిపేవారు.

ఒక దినం మహారాణి స్వయంగా వంట చేస్తోంది. కాలే పెనము దింపేటప్పుడు చేయి కాలింది. చాల బాధ కలిగింది. ఇక మహారాజుగారి సమక్షంలో వచ్చారు రాణిగారు. దుడుకు పలుకులతో మెల్లగా "ఓ మహారాజా! వంట పనిలో సహాయార్థం ఒక పరిచారికను ఏర్పాటు చేస్తే ఎంతో బాగుంటుంది" అన్నదామె. రాణిగారి విన్నపం ఆలకించారు రాజుగారు. "ఓ ప్రియా! మా ఆదాయం స్వల్పం అన్న విషయం నీకు తెలుసు. ఈ స్వల్ప ఆదాయంలో పనిమనిషిని పెట్టే స్తోమత మనకెక్కడిది? ఇక ప్రభుత్వపు ధనాగారంలోని సొమ్ము ప్రజల ధనం కాపాడమని నమ్మకంతో చేతికిచ్చిన నిధి. అట్టి ధనం కేవలం ప్రజా సౌకర్యాలకై, సంఘ సంక్షేమానికై ఉపయోగించాలి. అందులో నుండి స్వయం పోషణకై వెచ్చించడం రాజుగారికి న్యాయమా? అలా జరగదు. ఇక పరిచారికను నియమించే భాగ్యం మనకెక్కడిది?" అన్నాడు రాజు.

రాణిగారు రాజుగారి ఉద్బోధనంతా విన్నారు. చెయ్యి కాలినా చప్పుడు చేయక ఊరకుండిపోయారు.

# 7. జంతువులపై దాక్షిణ్యం

చాలా కాలం క్రితం జరిగిన విషయం. గజనీ పట్టణంలో ఒక వ్యక్తి ఉండేవాడు. అతని పేరు సుబుక్తగీన్. అతడు బీదవాడయినప్పటికీ తన వర్గం వారికి నాయకుడు. అతని వద్ద ఒక గుర్రం ఉండింది. అది తప్ప మరేమీ ఉండేది కాదు. తన అధిక సమయం వేటలో గడిపేవాడు. ఇక ఖాళీగా ఉన్నప్పుడు వినోద విహార స్థలాలు సందర్శించేవాడు.

ఒక దినం వేటకు వెళ్ళాడు సుబుక్తగీన్. గుర్రంపై స్వారీ చేస్తూ పోతున్నాడు. దారిలో ఒక లేడి, లేడి పిల్ల పచ్చిక బయలులో మేయటం చూశాడు. వెంటనే తన గుర్రాన్ని వాటివైపే మళ్ళించి, వేగంగా వాటిని వెంబడించాడు. తల్లి, పిల్ల ప్రాణాలు కాపాడుకొనుటకు అతి వేగంగా పరుగెత్తసాగాయి. లేడిపిల్ల అయితే మాత్రం లేత వయస్సులో ఎంత దూరం పరుగెత్తగలదు? అలసిపోయింది. పరుగెత్తలేక పట్టు బడింది. సుబుక్తగీన్ లేడి పిల్లను ఇంటికి తీసుకుపోతున్నాడు.

జంతువైతే మాత్రం మాతృ హృదయం కఠినంగా ఉంటుందా? తన కూన కోసం ఆ లేడి సుబుక్తగీన్ వెంట రాసాగింది. వెంట వచ్చే జింకను చూశాడు సుబుక్త గీన్. విచారవదనంతో, తాపత్రయపడు వీక్షణాలతో, నిరాశతో, మందగమనంతో నడిచి వస్తున్న లేడిని చూచి సుబుక్తగీన్‌కు జాలివేసింది. కారణం కనుగొన్నాడు. వెంటనే లేడి పిల్లను వదలివేశాడు సుబుక్తగీన్. స్వేచ్ఛ బడసిన లేడి పిల్ల గంతులు వేస్తూ తల్లి వద్దకు వచ్చింది. అంతులేని ఆనందంతో తల్లి, పిల్ల అడవిలో అదృశ్యం అయ్యాయి.

ఆ రాత్రే సుబుక్తగీన్ ఒక కల చూశాడు. మహాప్రవక్త ముహమ్మద్ (స) అతనికి ఆనాటి రాత్రి స్వప్నంలో కనబడ్డారు, ఈ విధంగా అన్నారు:

"విచారంతో నిస్పృహ చెందివున్న జింకపై నీవు చూపిన దాక్షిణ్యం అల్లాహ్‌కు నచ్చింది. ఇక నీ పేరు రాజ్యాధికారుల పట్టికలో వ్రాయబడింది. కొద్ది రోజులలోనే నీవొక రాజువు కానున్నావు. రాజ్యం లభించిన పిమ్మట గర్వించక ఇదే దయాదాక్షిణ్యాలతో ప్రజలను పాలించాలి."

కలగన్నట్టే సుబుక్తగీన్ రాజయ్యాడు. జరిగిన సంఘటనను యావజ్జీవితం జ్ఞాపకముంచుకున్నాడు. ప్రజలను ఎంతో ఆదరించి రాజ్యం చేశాడు.

# 8. ఆడిన మాట తప్పరాదు

ఒకప్పటి విషయం. మహాప్రవక్త ముహమ్మద్ (స) నిండు యవ్వనంలో ఉన్నారు. అప్పటికింకా వారు దైవ ప్రవక్తగా నిర్ణయమొందలేదు-వ్యాపారం చేసే

వారు. ఆ సమయంలో అబ్దుల్లా అనే వ్యక్తి ఉండేవాడు. ఈ వ్యక్తితో ముహమ్మద్(స)కు వ్యాపార సంబంధాలు ఉండేవి.

ఒకనాడు వారిరువురు ఒక వ్యాపార విషయంలో మాట్లాడుకున్నారు. క్రయవిక్రయపు విషయం దాదాపు పూర్తయింది. ఇక ఆ ఒప్పందానికి ఒక తుది రూపం ఇవ్వవలసి ఉండింది. ఇంతలో అబ్దుల్లాకు ఏదో ఒక కారణంపై వెంటనే అక్కడి నుండి వెళ్ళవలసి వచ్చింది. వెళుతూ, "మీరిచ్చటే ఉండండి, వచ్చి విషయం పూర్తిగా నిర్ణయం చేసుకుందాం" అని చెప్పాడు అబ్దుల్లా. సరేనని కూర్చున్నారు ముహమ్మద్ (స).

వెళ్ళిన అబ్దుల్లా అసలు విషయాన్ని మరచిపోయాడు. మూడు రోజులు గడిచినా వాగ్దానం జ్ఞాపకం రాలేదు. మూడవ రోజు ముహమ్మద్ (స)కు ఇచ్చి వచ్చిన మాట గుర్తుకు వచ్చింది. వాగ్దానం ఇచ్చివచ్చిన చోటుకు వెళ్ళాడు అబ్దుల్లా. ముహమ్మద్ (స) అచ్చటే కూర్చుని అబ్దుల్లా రాకకై నిరీక్షిస్తున్నారు. అబ్దుల్లా తన తప్పిదంపై సిగ్గు చెందాడు. ఎంతో పొరపాటు జరిగిందని మనోవేదన చెందాడు. కాని ముహమ్మద్ (స)కు ఏ మాత్రం కోపం రాలేదు. ప్రశాంతంగా, "ఓ అబ్దుల్లా! ఎంత శ్రమపెట్టావు. మూడు దినాల నుండి ఇచ్చటే కూర్చుని నీ రాకకై ఎదురుచూస్తున్నా"నని అన్నారు.

# 9. గురువు యెడల గౌరవం

హారూన్ అల్ రషీద్ ప్రసిద్ధి చెందిన మహారాజులలో ఒకడు. అతని కుమారుని పేరు మామూన్. మామూన్ అమిత గారాబంతో, ప్రేమాభిమానాలతో పెంచబడేవాడు. కాని మామూన్ మంచి బాలుడగుటకు బదులు దౌర్జన్యం చేయ సాగాడు. మొదటే రాకుమారుడు, దానికితోడు మక్కువతో పోషింపబడుతున్నాడు. ఈ రెండు గారాబాలే ఆ బాలుని పెడమార్గం పట్టించాయి. అంతఃపుర పరిచార

కులందరినీ అంతులేకుండా హింసించేవాడు మామూన్. పెద్ద, చిన్న అనే తేడా లేకుండా అడ్డం వచ్చిన వారినందరినీ అతడు బాదేసేవాడు. కొట్టినా, తిట్టినా సహించి మౌనం వహించేవారు పరిచారకులందరు. దీనివల్ల మామూన్ రోగం మరింత ముదిరింది. గర్వం హెచ్చింది. భయం అంటూ లేక పోయింది. ఎప్పుడూ మదగర్వంతో విర్రవీగుతూ స్వేచ్ఛగా ఇష్టానుసారం కాలం గడిపేవాడు.

మామూన్ పెద్దవాడయ్యాడు. విద్యాభ్యాసం గరిపే వయస్సు వచ్చింది. విద్యాబోధనార్థం ఒక గురువుగారు నియమింపబడ్డారు. గురువుగారు అంతఃపురం వచ్చారు. వచ్చి మామూన్‌ను పిలిచారు. మొదటే మామూన్ తుంటరి పిల్లవాడు, మంచీ చెడూ తెలియనివాడు. తగవులు, తమాషాలలో కాలం గడిపేవాడు. గురువుగారి పిలుపును లెక్కచేయక అంతఃపురంలో పరుండిపోయాడు. నౌకరును పిలిచి మామూన్‌ను రమ్మని చెప్పి పంపారు గురువుగారు. కాని ప్రయోజనం లేకపోయింది, పైగా నౌకరు గురువుగారి వద్దకు వచ్చి, "మామూన్ ఎప్పుడూ ఎడాపెడా అందరిని దండిస్తుంటాడు. ఏం చెయ్యగలం? సహించి మౌనంతో ఊరుకుంటున్నాం" అని షికాయతు చేశాడు. వచ్చిన గురువుగారు బాలుర మనస్తత్వం బాగా తెలిసినవారు. వెంటనే మామూన్ తలబిరుసుతనాన్ని గ్రహించారు గురువుగారు.

ఎలాగయితేనేమి చివరకు మామూన్‌ను బయటికి రప్పించారు. రాగానే బెత్తంతో ఏడు దెబ్బలు బాదేశారు గురువుగారు. బాధపడలేక మామూన్ ఎగిరెగిరి గంతులు వేశాడు. ఇంతవరకు ఎవరిచేత దెబ్బలు తినని మామూన్ గురువుగారిచేత శిక్షింపబడ్డాడు. గురువు యెడల గౌరవంగా ఉండాలి కదా! ఆ గౌరవార్థం ఏమాత్రం కసురుకోక, కన్నీరు కారుస్తూ ఉండిపోయాడు మామూన్.

అంతలో అటు వైపు మంత్రిగారు వచ్చారు. మామూన్ మర్యాదగా కూర్చుని చదువసాగాడు. మంత్రి చూచీచూడనట్లే వెళ్ళిపోయాడు. ఇక గురువుగారు బాలుని చూచి, "ఏం నాయనా! దెబ్బలు పడ్డాయని మంత్రిగారితో ఆరోపించకపోవడానికి కారణం?" అని అడిగారు.

"గురువర్యా! నా మేలును కోరి మీరు నన్ను శిక్షించారు. ఇక నేనేమని ఆరోపించగలను? మంత్రిగారి మాట అటుండనీయండి. రాజ్యంలోని ప్రజల నందరినీ పాలించు నా తండ్రి స్వయంగా ఇటు వచ్చి నా గురించి అడిగినా నేను మీ మీద ఆరోపించి ఉండేవాడను కాను" అని అన్నాడా బాలుడు.

అప్పటి నుండి అందరి మీద దౌర్జన్యం చేయడం మానివేశాడా బాలుడు. సత్శీలతతో ప్రవర్తించసాగాడు.

# 10. తల్లిదండ్రులు లేని బిడ్డలపై దయచూపుట

హాతింతాయి పేరు మీరు వినియే ఉంటారు. అతడొక ధర్మదాత. అతని వంశంలోనే ఇంకొక మహాపురుషుడు పుట్టాడు. ఇతని పేరు దావూద్‌తాయి. దావూద్‌తాయి భక్తిపరుడు, ధర్మజ్ఞుడు కూడా.

దావూద్‌తాయికి మాంసాహారం ఎన్నాళ్ళ నుండో లభించలేదు. ఒక రోజు అతనికి మాంసం తినాలన్న కోరిక కలిగింది. మాంసం తెప్పించాడు. వంట మనిషి ఘుమఘుమ సువాసన వెదజల్లు రుచికర మాంసాహారం వండాడు. భోజన సమయానికి అన్నం వడ్డించబడింది. దావూద్‌తాయి అన్నం ముందు కూర్చున్నాడు. వెంటనే వీధిలో ఉన్న తల్లిదండ్రులు లేని బాలురు జ్ఞాపకం వచ్చారు. వ్యక్తిగతంగా ఆ బాలుర పేర్లు తీసుకుంటూ వారి పరిస్థితి ఎలా ఉందని వంట మనిషిని అడిగాడు దావూద్‌తాయి. వంట మనిషి ఉన్న విషయం ఉన్నట్టు చెప్పాడు.

"పాపం పసిబాలురు పేదరికంతో, దారిద్ర్యంతో బాధపడుతున్నారు. వారికి మంచి రోజులు ఎప్పుడు వస్తాయో?" అని చెప్పాడా వంట మనిషి.

"అంటే వారికి మాంసాహారం తినే ప్రాప్తం ఇంకా లేదన్న మాట. సరే, ఈ పదార్థాలనన్నింటినీ తీసుకెళ్ళి ఆ అనాథ బాలురకు వడ్డించిరా" అని ఆజ్ఞ ఇచ్చాడు వంట మనిషికి దావూద్‌తాయి.

ఎన్నాళ్ళ నుండో దావూద్‌తాయి కూడా మాంసాహారం భుజించలేదన్న విషయం వంట మనిషికి తెలుసు.

"అయ్యా! మీరు కూడా చాలా కాలం నుండి మాంసాహారం భుజించలేదు కదండి. ఈ పూట మీరు ఈ ఆహారాన్ని తీసుకోండి. మరొకప్పుడు ఆ అనాథ పిల్లలకు ఆహారం పెట్టవచ్చు" అని అన్నాడా వంటాయన.

"లేదు, ఇక నేనీ ఆహారం భుజించలేను. ఆ పిల్లలకు ఈ పదార్థాలను వడ్డించిరా. ఈ వంటను వారారగిస్తే అది అల్లాహ్ వద్దకు చేరుతుంది. ఆ పుణ్య ఫలం నాకు లభిస్తుంది. అలాకాక నేనే స్వయంగా ఈ ఆహారాన్ని తినేస్తే అదంతా మట్టి పాలవుతుంది" అని అన్నాడా ఆదర్శ పురుషుడు.

వండిన మాంసాహారం వీధిలో ఉన్న అనాథ పిల్లలకు పంపాడు దావూద్‌తాయి. మనసారా కోరి వండించిన రుచికరమయిన పదార్థాలను దైవ మార్గంలో వినియోగించి పరలోక పుణ్యఫలాన్ని ఆశించిన ఆదర్శ జీవి దావూద్‌తాయి.

# 11. అన్నదానం

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) నిరుపేదలను ఆదరించడంలో ఎంతో శ్రద్ధ తీసుకునేవారు. ప్రతి దినం పేదలకు ఆతిథ్యమివ్వనిదే భోజనం చేసేవారు కాదు.

ఒక దినం చేప మాంసం తినాలన్న కోరిక కలిగింది వారికి. చేపలు ఇంటికి తెచ్చారు. వారి సతీమణి పేరు సఫియా (రజి అల్లాహు అన్‌హా). ఆమె వంట చేశారు. వండిన ఆహారం భోజనశాలయందు వడ్డించబడింది. ఇంతలో నిరుపేద ఒకడు ఇంటి వాకిట చేరాడు. అన్నం కావాలని కోరాడు. వెంటనే అబ్దుల్లా (రజి) ఆహార పదార్థాలను ఆ నిరుపేదకు ఇవ్వమన్నారు తన సతీమణితో.

ఒకప్పుడు పొరుగింటి స్త్రీలు సఫియా (రజి)పై ఒక ఆరోపణ చేశారు. భర్త అన్నపానీయ విషయాలలో సరిగా శ్రద్ధతో చూడటం లేదని తప్పుపట్టారు. ఆదర్శ ఇల్లాలుకు పతి సేవ ఎంతో అవశ్యం కదా! అయినా సఫియా (రజి) ఈ విషయంలో నిర్దోషియే.

"ఏం చేయనండీ? ఎంతో కష్టపడి మంచి మంచి వంటకాలు పతి కోసం ప్రతి దినం చేస్తున్నాను. కాని వారు ఆ పదార్థాలన్నింటినీ నిరుపేదలకే ధర్మం చేస్తున్నారు" అన్నారు సఫియా (రజి).

ఎలాగయితేనేం, పతి సేవ చేయదలిచారు. వారికి కడుపునిండా భోజనం పెట్టాలని తలపెట్టారు సఫియా (రజి)గారు. అందుకొక ఉపాయం తలపెట్టారు. బీదసాదలు అబ్దుల్లా (రజి) వచ్చు మార్గంలో కూర్చుని ఉండేవారు. ఇక వారిని అక్కడ కూర్చోవద్దని కబురు పంపారు. అంతేకాదు, ఇంటికి రమ్మని తన భర్త పిలిచినా వారు రావలసిన అవసరం లేదని చెప్పి పంపారు.

ఆ మరునాడు అబ్దుల్లా (రజి) మస్జిదులో నమాజు చేసి ఇంటికి రాసాగారు. దారిలో పేదవారెవ్వరూ అగుపించలేదు. వెంటనే వారందరి ఇండ్లకు కబురు పంపారు. ఇంటికి రమ్మని ఆహ్వానించారు. కాని లాభం లేకపోయింది.

పేదవారికి ఆతిథ్యం ఇవ్వనిదే అబ్దుల్లా (రజి) ఎప్పుడూ భోజనం తీసుకొనరు కదా? ఆ రాత్రి భోజనం చేయక అలాగే ఆకలి బాధను అనుభవిస్తూ రాత్రి గడిపారు అబ్దుల్లా (రజి).

# 12. భిక్షమెత్తుట తగదు

దైవ ప్రవక్తలు అల్లాహ్‌కు ఇష్టమయినవారు. అందునా మహాప్రవక్త ముహమ్మద్ (స) అంటే అల్లాహ్‌కు అమిత ప్రీతి. మానవాళికి సర్వోత్తమ జీవిత మార్గం చూపేందుకు వారు ప్రపంచంలోకి పంపబడ్డారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) లోక కళ్యాణానికి ఎన్నో కష్టనష్టాలననుభవించారు. ఎన్నో త్యాగాలు చేశారు. మరి ప్రజల కర్తవ్యమేమిటి? వారు చూపిన ఆదర్శ మార్గాన్ని అనుసరించి ఆచరించడమే కదా!

కాని కొందరు దౌర్భాగ్యులు మహాప్రవక్త (స)ను అనుసరించక వారి మార్గంలో అడ్డువచ్చారు. ప్రవక్తను, వారి అనుచరులను నానావిధాలా హింసించారు. ఆ మూఢులు ప్రవక్త (స)ను హత్య చెయ్యడానికి సాహసించారు. చివరకు స్వదేశం నుండి బహిష్కరింపజేశారు. అంతటితో ఊరుకోక హిజ్రత్ (దైవ మార్గంలో

స్వదేశాన్ని వదలివెళ్ళుట) చేసి మదీనా వెళ్ళిన తర్వాత కూడా ఆ దుష్టుల దౌర్జన్య కాండ కొనసాగుతూ వచ్చింది.

ఈ సత్యతిరస్కారులు ఒకనాడు పెద్ద సైన్యంతో మదీనా పట్టణంపై దండెత్తారు. మహాప్రవక్త ముహమ్మద్ (స), ఆయన సహచరులు ధర్మరక్షణార్థం ఎన్నో త్యాగాలు చేశారు. శత్రువుల నెదుర్కొనుటకు ఆబాలగోపాలం అందరూ సంసిద్ధులయ్యారు. దైవ మార్గంలో ప్రాణత్యాగం చేసి దైవ విద్రోహశక్తులను తుద ముట్టించడానికి ముందుకు వచ్చారు. అలా వచ్చినవారిలో కొందరు బాలురు కూడా ఉన్నారు. చిన్న వయస్సులో ఉన్న బాలురను సైన్యంలో చేర్చుకోడానికి మహాప్రవక్త (స) నిరాకరించారు.

అలాంటి చిట్టి బాలురలో అబూ సయీద్ (రజి) ఒకరు. కాని ధర్మయుద్ధంలో పాల్గొనాలని ఎంతో ఉత్సాహంతో వచ్చారు అబూ సయీద్ (రజి). ఆ బాలుని తండ్రి కూడా ముందుకు వచ్చాడు. తనయుని సైన్యంలో చేర్చుకోవలసిందని మహాప్రవక్త (స)ను కోరాడు. "ఓ ప్రవక్తా! ఈ బాలుని శరీరావయవాలు దృఢంగా ఉన్నాయి. దేహస్థితి సౌష్టవంగా ఉంది. కేవలం వయస్సనుకాక కండబలం చూచి సైన్యంలో చేర్చుకోండి" అని మహాప్రవక్త (స)ను కోరాడు ఆ ఆదర్శ వీర పితామహుడు.

కానీ లాభం లేకపోయింది. యుద్ధంలో చేర్చుకోబడనందుకు బాధపడ్డాడు ఆ బాలుడు. చివరకు యుద్ధం ముగిసింది. దైవ సహాయంతో ముస్లిమ్‌లకు విజయం ప్రాప్తమయింది. కాని అకుంఠిత దీక్షగల అనేక అగ్రశ్రేణి విశ్వాసపరులు ఆ ధర్మయుద్ధంలో స్వర్గీయులయ్యారు. ప్రాణ నష్టం ముస్లిమ్‌లకు కలిగింది. అబూ సయీద్ (రజి) గారి తండ్రి ఆ యుద్ధంలోనే స్వర్గీయులయ్యారు.

ఆ కాలంలో మహాప్రవక్త (స) సహచరుల వద్ద అట్టే ధనం కూడా ఉండేది కాదు. ఉన్న ధనం దైవ మార్గంలో, ధర్మ యుద్ధంలో ఖర్చు చేశారు. అబూ సయీద్ (రజి) ఇంకా చిన్నపిల్లవాడు. ఇంటి బయటకు వెళ్ళి ధనమార్జించేవారెవరూ లేరు. ఇక ఏం చెయ్యాలన్న సమస్య ఏర్పడింది. అల్లాహ్, ప్రవక్త (స) తప్ప ఆదరించేవారెవరూ లేకపోయారు.

అబూ సయీద్ (రజి), మహాప్రవక్త ముహమ్మద్ (స) సమక్షంలోకి వచ్చారు. ఇంటి పరిస్థితులు మహాప్రవక్త(స)కు తెలియపరిచి ఏదైనా సహాయం అర్థించాలని అనుకున్నారు. కాని అబూ సయీద్ (రజి)ను చూడగానే మహాప్రవక్త (స) ఇలా అన్నారు :

"ఓర్పు కోరే వారికే దైవం ఓర్పును ప్రసాదిస్తాడు. పరిశుద్ధ మనస్తత్వం కోరే వారికే పరిశుద్ధ చిత్తం అల్లాహ్ ప్రసాదిస్తాడు. ఇంకా ఎవరయితే చింతారహితమయిన జీవితం కోరుతారో వారికి నిశ్చింతపు జీవితం ప్రసాదిస్తాడు అల్లాహ్."

ఈ ముత్యాల వంటి మాటలు మహాప్రవక్త (స) నోటి నుండి వెలువడ్డాయి. అబూ సయీద్ (రజి) మనస్సు మారింది. ఏమీ అడుగక అచ్చటి నుండి మౌనంతో తిరిగి వెళ్ళారు అబూ సయీద్ (రజి). ఈ మార్పు అల్లాహ్‌కు ఎంతో సంతోషం కలిగించింది. పిన్న వయస్సులోనే ఆ బాలునికి ఎంతో విజ్ఞాన విద్య లభ్యమయింది. ఆ కాలపు విద్యాధినేతలలో ఒక ప్రత్యేక స్థానం పొందారు అబూ సయీద్ (రజి).

# 13. న్యాయం

పూర్వం జరిగిన విషయం, ఢిల్లీని రాజధానిగా చేసుకుని ఒక ముస్లిమ్ రాజు భారత దేశాన్ని పాలించేవాడు. అతని పేరు ముహమ్మద్ తుగ్లక్. ఇతడు దూరాలోచనపరుడు, న్యాయసంస్థాపకుడు కూడా.

ముహమ్మద్ తుగ్లక్ ప్రజాభిప్రాయం తెలిసికొనుటకు, వారి కష్టసుఖాలను గుర్తించుటకు పురవీధులలో గస్తీ చేసేవాడు. ఒకప్పుడు ఒక వీధిలో పోతుండగా ఇద్దరు బాలురు తగవులాడుట చూశారు రాజుగారు. అందులో ఒక బాలుడు ధనిక కుటుంబీకుడు. మరొక బాలుడు బీద కుటుంబీకుడు. ధనిక కుటుంబీకుడు బజారులో నిలబడి పేద బాలునిపై నిందారోపణ చేస్తున్నాడు, బీద బాలుడు విలపిస్తున్నాడు.

రాజు ఆ దృశ్యాన్ని చూచి పేద బాలునికి అన్యాయం జరుగుతోందని గ్రహించాడు. ఇక ధనిక బాలుని హెచ్చరించదలచి బెత్తంతో నాలుగు దెబ్బలు కొట్టాడు. కాని వాస్తవానికి తప్పు పేద బాలునిదే. ధనిక బాలుడు పేద బాలునిపై

ఏ మాత్రం చేజాచి ఉండలేదు. చేసిన తప్పుకు ఎక్కడ దెబ్బలు పడునో అన్న భయంతో మున్ముందే విలపిస్తున్నాడతడు.

తుగ్లక్ రాజ్యంలో పౌర హక్కులు విస్తృతంగా ఉండేవి. చివరకు రాజుగారిపై కూడా నేరం మోపడానికి ప్రజలకు స్వాతంత్ర్యం ఉండేది. నిర్దోషి అయిన ధనిక బాలుడు రాజు గారిపై నేరం మోపాడు. అన్యాయంగా తనను శిక్షించినందుకు రాజుగారిని దండించండని ఆ బాలుడు న్యాయాధిపతికి ఫిర్యాదు చేశాడు. వివాదం న్యాయస్థానంలో విచారించబడింది. రాజు నేరస్థుడని తేలింది. అదే విధంగా తీర్పు ఇవ్వబడింది. మహారాజు శిక్ష అనుభవించవలసివచ్చింది.

రాజుగారి ప్రవర్తన చూడండి! వెంటనే శిక్ష అనుభవించడానికి సంసిద్ధుడయ్యాడు. న్యాయాధిపతి నిర్ణయం ప్రకారం బాలుడు సభలోకి వచ్చాడు. అతని చేతిలో బెత్తం ఉంది. ఇక బాలుని ఎదుట హాజరై అకారణంగా కొట్టినందుకు తనను శిక్షించమని కోరాడా బాలునితో మహారాజు. బాలుడు పసివాడు. మహారాజుని చూసి జంకాడు. కాని ప్రమాణం చేసి అభయమొసంగి, శిక్ష నొసంగుమని బాలుని కోరాడు ఆ రాజు నిండు సభలో. ప్రజాసమక్షంలో ఆ బాలుడు ఇరవై ఒక్క దెబ్బలను దరువు బెత్తంతో వేశాడు బాదుషాకు. దెబ్బల వల్ల బాదుషాగారి కుల్లాయి కూడా క్రిందపడింది. కాని రాజుగారి మనోనిశ్చలతయందు ఏ మాత్రం మార్పు కలుగలేదు. వినయ విధేయతలతో శిక్షననుభవించడమే చేసిన తప్పుకు పరిహారం అని అందిరికీ నిరూపించి చూపాడు ఆ రాజు.

రాజుగారి న్యాయాన్ని చూచి సభికులందరు దిగ్భ్రాంతి చెందారు. న్యాయజీవితపు నిదర్శనం ఎట్టిదో చూశారా!

# 14. దౌర్జన్యంపై సహనం

అబూ సయీద్ (రజి) మహాప్రవక్త(స) సహచరులలో ఒకరు. ఆయన జీవితంలో జరిగిన సంఘటన ఒకటి వినండి. ఒకప్పుడు ఒక ఇంటి విషయంలో ఒక గయ్యాళిగంప అబూ సయీద్ (రజి)తో వివాదమాడింది. తనదికాని ఇంటిని దౌర్జన్యంతో అబూ సయీద్ (రజి) నుండి వశపరచుకోదలిచింది. అమృత వచనాలతో

మోసగించి ఇల్లు తనదేనని వాదించింది. అబూ సయీద్ (రజి) సాధుస్వభావుడు. జగడంమాని ఆ ఇంటిని వదలివేశాడు. గయ్యాళిగంప వచ్చి ఆ ఇంటిలో స్థిరపడి పోయింది.

సత్శీలుడైన అబూ సయీద్ (రజి)పై దౌర్జన్యం జరిగింది. అది ఆయనకు అమిత బాధను కలిగించింది. అల్లాహ్‌ను ప్రార్థించాడు. "ఓ ప్రభూ! ఈ స్త్రీ వాదన అసత్యమైతే ఆమెను అపరాధుల్ని చేసి ఆ ఇంటిలోనే ఆమె సమాధి కట్టించ"మని ఎంతో ఆవేదనతో శపించాడు.

ఆ శాపపు పలుకులను అల్లాహ్ స్వీకరించాడు. గయ్యాళి గంప దౌర్జన్యంగా ఇంటిని వశపరచుకుని సుఖపడగలదా? కొన్ని దినాలలోనే ఆమె చూపులు తగ్గాయి. క్రమేణా గ్రుడ్డిదై పోసాగింది. చూచినవారందరు అబూ సయీద్ (రజి) శాపం ఆమెకు తగిలిందని అనుకునేవారు.

ఒక దినం వేకువ జామున లేచిందామె. కంటికేమీ కనిపించడం లేదు. తడుముకుంటూ పోసాగింది. ఆ ఇంటిలో ఒక పాత నుయ్యి ఉండేది. వెళ్ళుతూ, వెళ్ళుతూ ఆ నూతిలో పడిందామె. చివరకు అదే నూతి ఆమె సమాధిగా మారింది.

భక్తిపరుల మనసు నొప్పించటం ఎవరికయినా క్షేమకరం కాదు.

# 15. పరుల సొమ్మును ముట్టరాదు

ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ప్రఖ్యాత ఖలీఫా. ప్రభుత్వ ధనాగారం అతని అధీనంలో ఉంది. ఆ ధనం ప్రజలదని, తాను దానికి 'అమానతుదారుడు (భద్రపరచేవాడు) మాత్రమేనని అతడు తలంచేవాడు. ఆ ధనాగారానికి కేవలం డబ్బులేగాక అనేక వస్తువులు కూడా వచ్చేవి. ఒకనాడు కొన్ని ఆపిల్ పండ్లు ఆ ధనాగారానికి వచ్చాయి. చట్ట ప్రకారం ఆ పండ్లను ఉమర్ ప్రజలలో పంచిపెడుతున్నారు. ఇంతలో తన చిన్న కుమారుడు అటు వచ్చాడు. బాలుడు పసివాడు, అమాయకుడు కూడా. ఆ పండ్లు ఎక్కడి నుండి వచ్చిందీ ఆ బాలునికి తెలియలేదు. తండ్రిగారు పండ్లను పంచుతున్నారు. అది చూచి పండ్లు తనవేనని భావించాడు బాలుడు, ఒక పండు తీసికుని తినబోయాడు.

పండ్లు ప్రభుత్వ ధనాగారానికి వచ్చాయనీ, అవి ప్రజలే అనుభవించాలన్న విషయం ఆ బాలునికేం తెలుసు పాపం? అయితే ప్రజల హక్కును స్వయంగా అనుభవించడం పరుల సొమ్మును అపహరించడంతో సమానమే కదా? వెంటనే ఆపిల్ పండును తనయుని చేతిలో నుండి తీసేసుకున్నాడు ఖలీఫా. బాలుడు ఏడవసాగాడు. ఎంత ఓదార్చినా బాలుడు ఏడుపు మానక ఇంటికి పోయాడు. తన తల్లితో ఫిర్యాదు చేశాడు బాలుడు. ఎంతయినా మాతృ హృదయం దయార్ద్ర హృదయం. కొడుకు కన్నీరు తుడిచింది తల్లి. బజారు నుండి ఒక ఆపిల్ పండు తెప్పించి ఇచ్చింది. పిల్లవానిని బుజ్జగించి నచ్చజెప్పింది.

ఖలీఫా ఇంటిలోకి వచ్చాడు. ఇంటిలో ఆపిల్ పండు సువాసన వస్తున్నది. ప్రభుత్వపు ధనాగారానికి వచ్చిన ఆపిల్ పండు మనింటికెలా వచ్చింది? తన సతీమణితో అడిగాడు ఖలీఫా.

"ప్రభుత్వ ధనాగారం నుండి వచ్చిన ఆపిల్ పండయితే కాదు. బజారు నుండి ఒక పండును తెప్పించి పసిపిల్లవానికిచ్చాన్లెండి. తన చేతిలో నుండి పండును మీరు లాక్కున్నారని ఇంటికి వచ్చి గోలపెట్టాడు అబ్బాయి. ఎంత నచ్చ జెప్పినా వినకపోవడంతో బజారు నుండి పండును తెప్పించి ఇచ్చా"నని అందామె కాస్త నిష్టూరంగానే.

ఖలీఫా ఆ మాటలు విన్నాడు. "ఏం చేయను? వచ్చిన పండ్లు ప్రభుత్వ ధనాగారానికి చెందినవి. అందుకే మన బాబు చేతి నుండి పండును లాక్కోవల్సి వచ్చింది. లేకుంటే ఒక పండుకై అల్లాహ్ సమక్షంలో అవిశ్వాసినై ఎక్కడ నిలబడవలసి ఉంటుందో అన్న భయం కలిగింద"ని అన్నాడా ధర్మజ్ఞుడు.

ఖలీఫా పలికిన మాటలు తనకు బోధపడినట్లు మౌనంగా ఉండి పోయిందామె.

-: సమాప్తం :-